


# చేతులు కాలాక...

– అరుణ నిష్టల

ఆఫీసులో ఒక సర్క్యులర్ వచ్చింది ఆ రోజు. పర్సనల్‌గా చదువులో సాధించిన విజయాలకి సంబంధించిన సర్టిఫికెట్లు ఫోటో కాపీలు పంపమనీ, బహుమతులు పంపిణీ ఉంటుందనీ! కంపెనీ గోల్డెన్ జూబిలీ సందర్భంగా చాలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇది ఒకటి. ఆ సంగతి తెలిసిన రమణారావు పి.ఎ. శంకరం ఉత్సాహంగా "సర్! చదివారుగా? రేపు మర్చిపోకుండా సర్టిఫికెట్స్ తెండి, ఫోటో కాపీలు తీయించి మన సెక్రటరీకి ఇస్తాను" అన్నాడు.

"బాగుందోయ్ శంకరం, చిన్నవాళ్ళకి సరదా కానీ రిటైర్ అయ్యే నాకు బహుమతులు ఏమిటి" అన్నాడు రమణారావు ఫైలు మూసి పక్కన పెడుతూ.

"భలేవారు సర్! కంపెనీ బహుమతులు ఇస్తుందని మీరు అన్ని డిగ్రీలు చేసారా? ఇప్పుడు కంపెనీ ఇస్తోందంటే అందుకోవటం మన డిపార్ట్‌మెంట్‌కే గౌరవం" అంటూ శంకరం బలవంతం చేసాడు.

ఉద్యోగంలో చేరేముందూ, చేరిన పిదప రమణారావు ఉత్సాహంగా చదువుతూ ఉండేవాడు. ఎమ్.కామ్. అయిపోయినా షిప్పింగ్ పరీక్షలు, సోషియాలజీ, ఇంగ్లీషు మొదలైన వాటిల్లో ఎమ్.ఏ. ఎమ్.బి.ఏ. ఇలా బోలెడు డిగ్రీలు సంపాదించాడు. అతడి దీక్షకి అందరూ ఆశ్చర్యపోయేవారు. 'ఆఫీసులో గడియారం, నిన్ను చూసే తొమ్మిదిన్నర కొడుతుంది, రాత్రి ఎనిమిదింటి దాకా ఆఫీసు వాసం, సంసారం పిల్లలూ ఇన్నింటి మధ్య ఎలా చదువుతున్నావు' అంటూ అందరూ విస్మయంగా అడిగేవారు. ఆ తరువాత ప్రమోషన్లు వచ్చి బాధ్యత మరింత పెరగగానే చదవడం తగ్గించాడు. ఇంకా సైకాలజీ చదవాలన్న తాపత్రయం అలాగే ఉండి పోయింది. 'రిటైర్ అయ్యాక ఎలాగూ తోచదు. చేతి నిండా టైమ్. బోలెడు చదవవచ్చు' అని ఎప్పుడో నిశ్చయం చేసుకున్నాడు.

"ఇన్ని డిగ్రీలు సంపాదించి ఏం చేస్తారు" కళ్ళలో ఆశ్చర్యం కనబడుతూండగా అడిగే సీత మాటలు జ్ఞాపకం వచ్చాయి. చిన్న నవ్వు పెదిమల మీద కదలాడింది. రమణారావు అమాయకంగా అడిగే భార్య మాటలకి ముందు ఏం చెప్పాలో తడబడినా, "ప్రపంచం దృష్టిలో డిగ్రీలు అనుకో. పరీక్ష అంటూ ఉండకపోతే చదవాలని ఉన్నా బద్ధకం రావచ్చు. అందుకే పరీక్షలు రాస్తాను. చదువు ఎందుకంటే ఏమనను. ఎంత చదివినా అంతం లేదు కదా?" అనేసాడు.

కంపెనీ కారు ఇల్లు చేరినా దిగని తనవంక డ్రైవరు విచిత్రంగా చూసేసరికి తత్తరపడ్డాడు రమణారావు. కారులోంచి దిగుతూ "నారాయణా రేపు ఒక గంటన్నర పెంద్రాళే రావాలి" అన్నాడు.

"అలాగే సార్" అన్నాడు నారాయణ వినయంగా. అలా ఎప్పుడైనా పెంద్రాళే రావటమూ, రమణారావు, ఇంటికి తీసుకువెళ్ళమని పళ్ళో స్వీట్లో తన డబ్బుతోనే కొని ఇవ్వటం అలవాటే నారాయణకి. ఆఫీసులో పని ముందు ఏదైనా గడ్డి పరకతో సమానం ఆయనకి అని అనుకుంటూంటాడు.

కారు శబ్దం వింటూనే రాహుల్ బాల్కనీ నుంచి తండ్రి రావటం గమనించి తలుపు తీసి ఉంచాడు. చల్లటి నీళ్లు అందించాడు, తండ్రి చేతులు కాళ్ళు కడుక్కోగానే. సాధారణంగా సీతే అందిస్తుంది. ఇంట్లో లేదంటే ఇంకా సొసైటీ పని నుంచి ఇంటికి రాలేదు. ఆ కాలనీ ఆడవాళ్ళందరూ కలసి ఒక సొసైటీ స్థాపించి అనాధ పిల్లలకి వీలయినంత సేవ చేస్తారు. నగరం మధ్యలో ఒక చిన్న బిల్డింగ్ అద్దెకు తీసుకుంది సొసైటీ. ఇలా లేటయితే ఎవరో ఒకరు సీతను కార్లో దిగపెడతారు. ఆ సంగతి తెలిసినా అలవాటుగా "అమ్మ ఏదీ" అనడిగాడు రమణారావు నీళ్ళు అందుకుంటూ.

"వచ్చేప్పటికీ ఆలస్యం అవుతుందని సాయంత్రం ఫోను చేసి చెప్పింది" అన్నాడు రాహుల్. రమణారావు తన రూమ్‌లో తనవెంట తెచ్చిన ఆఫీసు కాగితాలు ఫైళ్ళు తీసి టేబుల్ మీద సర్దాడు. రేపు మీటింగ్‌కి అవసరమైన విషయాలు ప్రొద్దుటే ఫైలు చేయించి పదింటికల్లా రెడీ చెయ్యాలి. ఛైర్‌మెన్‌తో మీటింగ్. ఒక బ్రాంచి నుంచి రావలసిన ఇన్‌ఫర్‌మేషన్ గల్లంతయి అంతా తారుమారు అయింది. రాహుల్ కప్పుతో వేడిపాలు, బిస్కట్లు తెచ్చి బల్ల మీద పెట్టి వెళ్ళిపోబోయాడు.

"రాహుల్" పిలిచాడు రమణారావు.

"ఏం నాన్నగారూ"

"నా టిఫిన్ రాత్రి ఇక్కడికే తెచ్చెయ్యమను అమ్మను. పని చాలా ఉంది" అన్నాడు.

"అలాగే"

"బాగా చదువుతున్నావా?" రొటీన్ ప్రశ్న వేసాడు.

"నిన్ననే నా పరీక్షలు అయిపోయాయి డాడీ" రాహుల్ తన నవ్వును పెదిమల వెనుకే దాచిపెట్టి అన్నాడు. ఖంగుతిన్నాడు రమణారావు. పిల్లాడు కాలేజీలో చదువుతున్నాడు. పరీక్షల సంగతే తెలియదు.

"ఓ! అలాగా! బాగా రాశావా" అని అడిగాడు. ఒక పక్కన అలవాటుపడిన అతడి కళ్ళు పేపరు నుండి అక్షరాలను చదివేస్తున్నాయి.ఆ తరువాత రాహుల్ ఏమన్నదీ అతడు వినలేదు.

ఒక అరగంట పోగానే స్నేహితురాలి పెళ్ళి నుంచి వచ్చిన మాధవి, తండ్రి గదిలో లైటు చూసి, "హలో డాడీ" అంటూ పలకరించింది. ఇరవై దగ్గర పడుతున్న మాధవి మెరుస్తున్న పూసలు వర్క్ చేసిన క్రీమ్ కలర్ పంజాబీ డ్రెస్‌లో ముత్యాల నగలు ధరించి కాస్తంత అలంకరణ ఎక్కువ చేసుకునేసరికి తనే ఒక పెళ్ళికూతురిలా ఉంది. ప్రొద్దుటే చెబుతోంది సాయంత్రం పెళ్ళికి వెళ్ళాలని.

"ఏమ్మా మాధవీ? పద్మ పెళ్ళి బాగా జరిగిందా" అని అడిగాడు.

"బాగా జరిగింది డాడీ" అంది మాధవి. బల్ల నిండా పరిచిన కాగితాలు చూస్తూనే తండ్రి దగ్గర ఎక్కువసేపు ఉంటే అతడి పనికి అంతరాయం అని తెలిసిన మాధవి ఒక్క క్షణం ఉండి వెళ్ళిపోయింది. వర్క్‌లో మునిగిపోయిన రమణారావు ఆ సంగతి గమనించలేదు. పనిచేస్తూంటే కాలం అతడి దగ్గరికి రాదు. ఆకలి దప్పులు కూడా భయపడతాయి. రాత్రి పది అవుతుంటే సీత రెండు చపాతీలు ఒక గిన్నెలో పెరుగు అన్నం పెట్టి పట్టుకు వచ్చింది. రాత్రి భోజనాల దగ్గర భోజనం చేస్తే కనీసం అర గంట పైనే అవుతుందని పని ఉంటే తన గదిలోకే భోజనం తెప్పించుకోవడం అలవాటే అతడికి. పని లేని రోజులు తక్కువే గనుక ఆ అలవాటు ఎక్కువ.

సీత రావటం చూసి చిన్నగా నవ్వుతూ, "ఎలా వుంది మీ సొసైటీ. ఏదైనా ప్రోగ్రాం ఉందా" అని అడిగాడు.

"మా సొసైటీ బాగానే ఉంది. మా హెల్త్ డే సెలబ్రేషన్స్ మూలంగా కాస్త ఆలస్యం అయింది. ఫ్లాస్కులో కాఫీ పోసి ఉంచనా పని ఉన్నట్లుంది" అని అడిగింది.

చేతులు కడుక్కుని టిఫిన్ ప్లేటు దగ్గరకి జరుపుకుంటూ "ఒక కప్పు చాల్లే! బహుశా పన్నెండింటికి అయిపోతుంది" అంటూనే ఎడం చేత్తో కాగితాలు చూడసాగాడు కళ్ళజోడు సర్దుకుని.

రెండు మూడు నిమిషాలు గడిచాయి. "మాధవికి పక్కింటామె సంబంధం తెచ్చారు. కుర్రాడు, చదువు, ఉద్యోగం అన్నీ బాగానే ఉన్నాయి కానీ మాధవి ఉద్యోగం వచ్చాక పెళ్ళి సంగతి అంటోంది. ఏం చేద్దాం? రేపటిలోగా చెప్పమంది ఆవిడ" సీత మాట్లాడక తప్పదన్నట్లు చెప్పింది.

కాగితాలు క్రిందపెట్టి "మంచిదేగా! ఆడపిల్లకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి. మనం స్నేహం కలుపుకుందాం. పెళ్ళి నెమ్మదిగా చెయ్యొచ్చు! వాళ్ళు ఒప్పుకుంటారేమో అడుగు! మాధవిని కూడా అడుగు" అన్నాడు మాట్లాడుతూనే కాగితాలు వెతుక్కుంటున్నాడు. మాట్లాడడానికి మాటలు కరువైనాయా అన్నట్లు ఆ గది నిండా నిశ్శబ్దం అలుముకుంది. పనిలో మునిగిన భర్తతో తమ సొసైటీలో సాధించిన విషయాలు, చెల్లెలు వచ్చే నెలలో గృహ ప్రవేశానికి రమ్మని ఉత్తరం రాసిందని చెప్పకపోవడమే అతడికి మేలని గ్రహించిన సీత లేచి డైనింగ్ హాలులోకి వెళ్ళిపోయింది, మిగిలిన పని పూర్తి చేయటానికి.

రమణారావు పని అయిపోయిందని తెలుసుకుని గడియారం రెండు కొట్టింది.

• • •

రమణారావు శంకరాన్ని ఇంకో ఇద్దరు ముగ్గుర్నీ పెంద్రాళే ఆఫీసుకి రమ్మన్నాడు. శంకరం, రమణారావు ఆఫీసుకి వస్తూనే సర్టిఫికెట్సు గురించి అడిగాడు 'తెచ్చారా' అని.

"అరె! శంకరం మర్చిపోయాను. అసలవి ఎక్కడున్నాయో వెదకాలి. ఇల్లు షిఫ్ట్ చేసినప్పుడు ఎక్కడ పెట్టామో గుర్తు లేదు. చూడాలి. అన్నట్లు అలహాబాదు బ్రాంచి నుంచి ఫోను వచ్చిందా?" అని అడిగాడు. అంతలోనే ఫోను మ్రోగటంతో అది అలహాబాదు బ్రాంచి నుంచి కావటంతో సీరియస్‌గా అటెండ్ అయ్యాడు. అతడికి ఇక మస్తిష్కంలో మీటింగ్ దానికి కావలసిన ఇన్‌ఫర్‌మేషన్ మినహా దేనికీ చోటుండదని అందరికీ తెలిసిన విషయమే!

ఆ మరునాడు సెలవు దినం కావటంతో రమణారావు కొంచెం ఆలస్యంగా లేచాడు. ఆవేళ సొసైటీలో ఫంక్షన్ వుందని సీత ప్రొద్దుటే వెళ్ళిపోయింది. హడావుడి ఏం లేకపోవడంతో ప్రొద్దుటి టీ.వీ. చూస్తూ కాఫీ తాగాడు. పేపరులో ప్రతీ అక్షరం చదివాడు. రమణారావుకి సెలవు రోజు అంటే శిక్షతో సమానం. అందులోనూ ఇంట్లో భార్యాపిల్లలూ తలో పనిమీద బయటికి వెళ్ళడంతో అసలే తోచలేదు. అటూ ఇటూ పచార్లు చేస్తూంటే అతడికి జ్ఞాపకం వచ్చింది సర్టిఫికెట్ల సంగతి. ఇంతకీ ఎక్కడున్నాయి అంటూ బీరువాలలో వెతికాడు. పాత బీరువాలో అడుగు అరలో దొరికింది ఆ ఫైలు అతడికి. ఆ ఫైలు లాగుతుంటే దానితో పాటుగా ఒక పాత డైరీ ఒకటి కిందపడి సగం తెరుచుకుంది. రమణారావు అది చేతిలోకి తీసుకుని చూసాడు. అంచుకి బంగారం గిల్టు ఉన్నట్లున్న ఆ కాగితాలు లోపల కాలంతో పాటు వయసు పెంచుకుని వన్నె తగ్గి పసుపు రంగుకి మారాయి. కానీ నల్లటి ముత్యాల్లాంటి అక్షరాలు చెక్కు చెదరలేదు. ఆ రైటింగ్ సీతదని అప్పుడే తెలిసిపోయింది. తేదీ చూస్తే పెళ్ళయిన కొత్తలో రాసినట్లుంది. సగం మటుకే రాసి ఉంది. ఒకపక్క సంస్కారం వద్దని వారిస్తున్నా కుతూహలం పేజీలు తిప్పి చదవమంటోంది. అతడి మనసు ఒక నిశ్చయానికి రాకముందే అతడి కళ్ళు ఆ అక్షరాల బారుల వెంట పరుగులు పెడుతూ అందులోని విషయాన్ని మెదడుకు చేరవేస్తున్నాయి.

'అంబరంలా తను. తారల్లాంటి అనుభవాలు. ఓహ్! జీవితం మధురస్వప్నం, ఆ సంబరానికి ప్రతీక నేను'

'తనకి చదువు మీద మక్కువ కాబోలు. చెంతన చెలి ఉన్నా మాట్లాడకుండా... అదేం బుషి?'

'ఇవాళ సాయంత్రం ఇద్దరూ కలసి సముద్రపు ఒడ్డుకి వెడదామనుకున్నాను. పుట్టిన రోజు, కలలు అలా తరుముకు వస్తాయి అలలలా! ఒడ్డుకు రాగానే అలలు కలసిపోయినట్లు కరిగిపోతున్నాయి కలలు.'

'వెండి వెన్నెలా పిల్ల తెమ్మెర అల్లరా జలతారు అంచుల వన్నె గల మేఘాలు. ఇవేం ఆయనకు కనిపించవేం? ఎన్నో కబుర్లు మనసు పొరలలోనే దాగిపోతున్నాయి.'

చదువుతున్న రమణారావు కనుబొమలు ముడి పడగా గాభరాగా పేజీలు చదివాడు. తనతో కలసి జంటగా విహారాలకని వెన్నెల వెలుగులో మాటలకందని భావాల మల్లెల మాలలల్లాలని, ప్రతి క్షణమూ మధురంగా ఉండాలనీ ఇలా ఎన్నెన్నో తన ఊహలు అన్నీ కలబోసి రాసుకుంది. ఇన్ని ఆలోచనలు సీత మనసులో ఉండేవా? ఎప్పుడైనా బయటికి వెళ్దామా అని అడిగేది. తీరా తను మర్చిపోయేవాడు. ఒకవేళ జ్ఞాపకం ఉంచుకుని వద్దామనుకున్నా ఏదో కొంప మునిగిపోయే అర్జంటు ఆఫీసు పనులు అడ్డం పడేవి. తను కనీసం సారీ కూడా చెప్పినట్లు జ్ఞాపకం లేదు. ఆలోచనలు ఆపి డైరీ చూసాడు.

"రాహుల్, మాధవి అసలు నిలువనివ్వరు. 'నాన్నగారితో ఎక్కడికైనా వెళదాం అంటారు. అమ్మా మా స్నేహితులు ఊటీ వెడుతున్నారుట. మనమూ వెళ్దాం మమ్మీ' అంటారు. ఎక్కడికి వెళ్తాం? నిరంతరం ఆఫీసు పనులు ఇంట్లో తరుముతూంటే..."

రమణారావుకి జ్ఞాపకం వచ్చింది పదేళ్ళనాటి మాట! ఒకరోజు ఇంటికి వచ్చేసరికి రాహుల్ పెద్దగా ఏడుస్తున్నాడు. సీత గట్టిగా ఏదో అంటోంది, ఉగ్ర రూపం దాల్చి.

"ఊటీ వెళ్తావా ఊటీ! ఉన్న ఊళ్ళో ఉన్న ప్రదేశాలు చూడటానికి లేదుగాని విహారయాత్రలు...

తను రాగానే 'డాడీ' అంటూ అంటుకుపోయి ఏడ్చాడు. సీత సాధారణంగా గట్టిగా పిల్లల్ని కోప్పడదు. చాలా శాంతం తనకి. ఎంతో ఓర్పుతో నచ్చచెబుతుంది పిల్లలు అల్లరిచేస్తే! అటువంటిది అంత గట్టిగా. రాహుల్ హడలిపోయి ఏడ్చేశాడు.

"ఊటీకే! అంతేనా? ఇందుకనా అంతలా ఏడుస్తున్నావు? పద! నీ సెలవులు ఎప్పటిదాకా ఉన్నాయో చెప్పు. రేపే నేను టిక్కెట్లు తెస్తాను! ఏం?" అంటూ ఊరడించాడు. అంత ఏడుపులోనూ కన్నీళ్ళ చారికలతో రాహుల్ ముఖం మచ్చ ఉన్న పున్నమి చందమామలా వికసించింది.

"రియల్లీ డాడీ" అంటూ కళ్ళలో మెరుపుతో తల్లివంక చూసాడు 'చూశావా నేను గెలిచాను' అన్నట్లు. ముఖం తిప్పుకుని సీత వెళ్ళిపోయింది అక్కడి నుంచి. రాహుల్ ఊటీలో తను ఎలా ఆడతాడో, అక్కతో పాటూ ఎలా తిరగాలో అన్నీ చెబుతూంటే విన్నాడు అప్పటికి. ఆ మరునాడే తనని మేనేజ్‌మెంట్ ట్రెయినీ క్రింద ఢిల్లీ పంపడంతో పదిహేను రోజుల పాటు కేంప్‌లో ఉండిపోయాడు.

అసలు ఊటీ సంగతి ఆ మరునాటి ప్రొద్దున్నే అతడికి జ్ఞాపకం లేదు. చిన్నవాడు రాహుల్ ఎంత ఆశతో తనని నమ్మేడో! గుండె పిండినట్లయింది రమణారావుకి.

తేరుకుని డైరీ చదివాడు! సాంతం చదివేసరికి తనని సీతా పిల్లలు ఎంతగా సమీపంగా ఉండాలని కోరుకున్నారో ఎంతగా తనతో గడపాలని కలలు కన్నారో వాళ్ళ మానసిక స్థితి అంతా కళ్ళకి కట్టినట్లయింది. ఆఫీసు పనిలో నిమగ్నుడై తను తన భార్యాపిల్లల ఆశలు గ్రహించలేకపోయాడు. వాళ్ళకి కావలసిన అవసరాలు సదుపాయాలూ సమకూరుస్తున్నానని తృప్తిపడిపోయాడు గానీ అన్నింటికన్నా వాళ్ళకి జీవితంలో కావలసినవి అందివ్వలేకపోయాడు. తనని తాను సమర్పణ చేసుకోలేకపోయాడు. వాళ్ళకి ఎంతో అన్యాయం చేశాడు. సీత ఎంత ఓపికగా రోజులు, నెలలు, సంవత్సరాలు ఎదురుచూసి నిరాశ చెందింది. జంటగా తనున్నా మానసికంగా ఒంటరితనం ఫీలయింది. తను ఎంత మూర్ఖుడు! ఎంతసేపూ తన ఆనందాన్ని వెతుక్కుని చదువులో ఆఫీసు పనిలో నిమగ్నమవుతూ మానసిక తృప్తిని తనివితీరా అనుభవించాడు. కేవలం తన పనులే కాదుగా! ఫామిలీ అంటూ ఏర్పరుచుకున్నాక దాని అవసరాలు గ్రహించలేదు. ఇంట్లోకి కావలసిన పరికరాలు, పిల్లల పుస్తకాలు ఖరీదైన బట్టలు, మంచి భోజనం ఇదే కదా జీవి తం అంటే. స్నేహం, అభిమానపూర్వకమైన నాలుగు మాటలు అందించలేకపోయాడు తన కుటుంబానికి!

ఎంత పని జరిగిపోయింది. తన జీవితంలో మధురమైన యవ్వనానికి ఆఫీసుకనీ చదువుకనీ వినియోగించి సీత కోరినట్లుగా కలగన్నట్లుగా గడపలేకపోయాడు. పిల్లల మనస్సు గ్రహించి మెలగకుండా ఆఫీసు బాధ్యతలు అవసరమైన దానికంటే అధికంగా వేసుకున్నాడు నెత్తి మీద. ఇవన్నీ చాలక ఇంకా రిటైర్ అయ్యాక సైకాలజీ చదవాలని అనుకుంటున్నాడు. తనవారి మనోప్రవర్తన కనిపెట్టలేకపోయాడు వారికి అత్యంత సమీపంగా వుండి! వారి మనసులని చదవలేకపోయాడు. ఎన్ని చదువులు చదివితేనేం ఏం ప్రయోజనం! నో! ఇక మీదట ఇలా కాకూడదు! తనవల్ల తెలియక ఒక ఘోర అపరాధం జరిగిపోయింది! ఇకమీదట అలా జరగదు. తన పనులకు అవసరమైనంత సమయం వినియోగించుకుంటాడు! మిగతా టైమ్ అంతా భార్యకీ, పిల్లలకీ!

డైరీ అందుకుని యధాస్థానంలో పెట్టేయబోతూ "సీతా డియర్ నేను నీ డైరీ దొంగతనంగా చదివాను! నన్ను క్షమించు. అంతేకాదు నీ భావాలు అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా నడుచుకోలేకపోయాను. అందుకు క్షమించడానికి ప్రయత్నించు" అని అనుకున్నాడు.

ఫైలు ఒకమాటు పరికించాడు. అన్ని సర్టిఫికెట్లు తను తన కుటుంబానికి చేసిన అన్యాయానికి సాక్షులుగా మౌనంగా అతడికేసే చూస్తున్నాయి! వాటిని బ్రీఫ్‌కేస్‌లో సర్దాడు!

• • •

ముఖ్యమైన ఆఫీసు పనులు అయిపోగానే 15 రోజుల లీవుకి అప్లై చేసాడు. ఆఫీసు అతడి భుజస్కంధాలపై ఆధారపడిందని అనుకున్న అతడి అనుచరులందరూ నోరు వెళ్ళబెట్టి ఉండిపోయారు! 'ఏమీ లేదు ఊరికినే సెలవు పెట్టాను' అని నమ్మించేసరికి రమణారావు తల ప్రాణం తోకకి వచ్చింది.

సిమ్లాలో నాలుగు రోజులు, ఆ చుట్టుపట్ల వారం రోజులు ఉండే ఏర్పాట్లు అన్నీ రహస్యంగా చేసాడు. రాహుల్ తను చెప్పబోయేది విని పసిపిల్లాడిలా ఎలా గంతులు వేస్తాడో ఊహించుకుని నవ్వుకున్నాడు. ముఖ్యంగా సీత పెద్ద పెద్ద కళ్ళతో ఆశ్చర్యమూ, ఆనందమూ కలబోసిన భావాలు చదవాలి. మాధవి చెప్పక్కరనే లేదు. ఎన్నెన్ని ఫోటోలు తీస్తుందో!

ఆవేళ ఆదివారం మధ్యాహ్నం భోజనాలు చేస్తూంటే మాటలలో రమణారావు "నేనొక అనౌన్స్‌మెంట్ చేస్తున్నాను. అందరూ నిశ్శబ్దంగా ఉండాలి" అంటూ ఊరిస్తున్నట్లుగా వారికేసి చూసాడు! అందరూ కుతూహలంగా అతడికేసి చూసారు, తినడం ఆపేసి.

"వచ్చే ఆదివారం మనం సిమ్లా, నైనిటాల్, ఢిల్లీ చూడటానికి వెళ్తున్నాం" అన్నాడు.

"ఓ డాడీ! యూ ఆర్ గ్రేట్" అని రాహుల్,

"వాట్ ఎ నైస్ సర్‌ప్రైజ్" అని మాధవి,

"నిజంగా" అంటూ సీత ఒక్కసారిగా అంటారని ఆశించిన రమణారావుకి వారి ముఖాలలో ఆశ్చర్యం తప్ప ఏం కనిపించలేదు. ఏం మాట్లాడలేదు!

"ఏమిటీ! నా ప్రపోజల్ నచ్చలేదా? మరెక్కడికైనా వెళ్దామా ఊటీ వగైరా..." అంటూ విస్మయంగా అడిగాడు.

"బాగానే ఉంది డాడీ! నాకు కాలేజీకి సెలవులే అయినా కంప్యూటర్ క్లాసులు ఉన్నాయి. అందుకని నేను రాలేను" అంటూ ఎపాలజిటిక్ తండ్రి కేసి చూసాడు రాహుల్.

"ఛీఫ్ మినిస్టర్ గారిని ఇక్కడికి వచ్చేటప్పుడు మా సొసైటీ కూడా ఆయనని ఆహ్వానించింది. సెక్రటరీగా పనంతా నాదే! అందుకని" సీత మధ్యలోనే ఆగిపోయింది. మాధవి ఏం చెప్పలేదు. ఎందుకంటే రాత్రిళ్ళు కూర్చుని చదువుతోందని బేంక్ పరీక్షలని సీత చెప్పటం జ్ఞాపకం వచ్చింది రమణారావుకి.

వారి సమాధానాలు వింటూనే అవాక్కయిపోయాడు. ఉరకలు వేస్తున్న మనస్సుతో వారి ఆనందాన్ని చూస్తూ తృప్తిపడాలని ఆశపడ్డ మనసుకి అశనిపాతంలా తగిలింది. నిరాశ మనసు నిండా ఆవరించింది. మౌనంగా తల దించుకున్నాడు.

తను ఇన్నాళ్ళకి తీరుబడి చేసుకుని తన పనులన్నీ అయిపోయాయి కదా అని వాళ్ళకి తీరుబడి ఉంటుందని ఆశించడం అవివేకం. అందరూ పెద్దవాళ్ళయ్యారు. వాళ్ళ వాళ్ళ వ్యాపకాలు వాళ్ళు ఏర్పరచుకున్నారు. సీత సొసైటీ అంటూ సంఘ సేవలోకి దిగడానికి తను సీత పట్ల చూపించిన ప్రవర్తనే కారణం అయి ఉండాలి. పిల్లలు పూర్వం తన నుంచి ఎంతో ఆశించి ఉంటారు. వాళ్ళు సంపూర్ణిగా తనని పొందనే లేకపోయారు. ఇప్పుడు డాడీ అంటూ ఎలా తిరుగుతారు! వాళ్ళకి జీవితంలో ముందు సాగేందుకు కావాల్సిన అవకాశాలు ఏర్పరచుకోవాలి! అందుకే వాళ్ళకి తీరుబడి లేదు.

కుటుంబం పట్ల తన నిరాసక్తత తన పరిధి ఒక వలయంలా గీసుకుని అందులోంచి బయటికి రాలేక తన పనులలో తన లోకమే తనది అన్నట్లు ప్రవర్తించాడు. వృక్షాన్ని పెనవేసుకుని ఉన్నట్లున్నా మూడు లతలకి తను ఏ మాత్రమూ సరైన ఆసరా ఇవ్వలేదు. మానసికంగా వాళ్ళకి దగ్గర కాలేకపోయాడు. మీరే నా జీవితం అన్నట్లు గడపలేదు. ఇప్పటికి ఇన్నాళ్లకి జ్ఞానోదయం అయి వాళ్ళని కోరుకున్నప్పుడు వాళ్ళు అందకుండా చాలా దూరం.. చాలా దూరం వెళ్ళిపోయారు. తన కోసం ఎన్నాళ్ళు ఎన్నేళ్ళు ఎదురుచూసారో?

'ఇన్ని డిగ్రీలు చదివి ఏం చేస్తారు' అని అడిగే సీత గొంతు చెవులలో మారుమ్రోగుతుంటే ఆ పెద్ద కళ్ళలోని భావాలు తను చదవనేలేకపోయాడు. ఎన్ని డిగ్రీలు చదివి ఏం ప్రయోజనం?

'నా జీవితం ఒక జీవితకాలం లేటు అయిపోయింది' అనుకుని గాఢంగా నిట్టూర్పు విడిచాడు రమణారావు.

తమ సమాధానం వింటూనే నల్లగా కమిలిపోయినట్లు అయిపోయిన తండ్రి ముఖం చూస్తే జాలి వేసింది పిల్లలకి, సీతకి.

"సారీ! డాడ్! మరొకసారి వెడదాం ఎప్పుడైనా!" అంటున్న మాధవికేసి రమణారావు చూడబోయాడు గాని, కళ్ళకి సన్నని నీటిపొర అడ్డుపడి సరిగ్గా కనబడలేదు రమణారావుకి.

'అవును మరొకసారి ప్లాను వేసుకుని వెడదాం' అని సీత అంటున్న మాటలు మౌనంగా రోదిస్తున్న అతడి మనసు దాకా చేరనే లేదు! ○

## మీకు తెలుసా?

ఫిబ్రవరి నెలకు 30 రోజులుండటం ప్రతి వెయ్యి సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. 2000వ సంవత్సరంలో వచ్చే ఫిబ్రవరి నెలలో 30 రోజులుంటాయి. ఈ తారీఖున జన్మించిన వారికి పుట్టినరోజు వేడుకలు అదే తేదిన చేసుకునే అదృష్టం ఇక ఆ జన్మకు ఉండదు!

★★★★

ఏ దేశం జాతీయ జెండా అయినా వెనుక, ముందు ఏ వైపు చూసినా ఒకేరకంగా ఉంటాయి. కానీ పరాగ్వే జాతీయ జండా మాత్రం.... ముందు వైపు ఒక విధంగా, వెనుక వైపు మరో విధంగా వుంటుంది!

★★★★

వాషింగ్‌టన్ నగరంలో ప్రతివేయి మందికి 1735 ఫోన్లు ఉన్నాయి. ఈ నగరంలో జనాభా కన్నా ఫోన్ల సంఖ్య ఎక్కువ.

★★★★

ప్రపంచంలో కల్లా అతిపెద్ద గుహ, ఫ్రాన్స్ దేశంలో ఉంది. ఆర్.జి.జీన్ బెర్నార్డ్‌గా పిలువబడే ఈ గుహలోతు 5,360 అడుగులు.